క్లుప్తంగా

నివాళి



మస్తాన్‌రెడ్డి కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి

వేంపల్లి : మండలంలోని పాములూరు గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ సీనియర్ కార్యకర్త, పులివెందుల లయోలా డిగ్రీ కళాశాలలో మ్యాథ్స్ విభాగంలో హెచ్‌ఓడీగా పనిచేసి రిటైర్డు అయిన మస్తాన్‌రెడ్డి గురువారం అనారోగ్యంతో మృతి చెందారు. ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి గ్రామానికి చేరుకుని ఆయన భౌతిక కాయానికి నివాళులర్పించి కుటుంబ సభ్యులకు సానుభూతిని తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఉప సర్పంచ్ మధుప్రభాకర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకుడు పెద్ద నాగ సుబ్బారెడ్డి, వైఎస్సార్‌సీపీ రైతు విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శి మస్తాన్ రెడ్డి, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

అధ్యాపకుడికి డాక్టరేట్



కె.హేమాద్రి

చింతకొమ్మదిన్నె : స్థానిక అన్నమాచార్య ఇంజనీరింగ్ కళాశాల మెకానికల్ ఇంజనీరులో సహాయ ఆచార్యులుగా పనిచేస్తున్న కె.హేమాద్రికి తమిళనాడు రాష్ట్రంలోని వేల్స్ విశ్వవిద్యాలయం వారు డాక్టరేట్ ప్రధానం చేసినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సుధాకర్‌రెడ్డి తెలిపారు. ఎక్స్పరిమెంటల్ ఇన్వెస్టిగేషన్ ఇన్ మెకానికల్ ట్రిబలాజికల్ క్యారెక్టర్సిక్స్ ఆఫ్ అల్యూమినియం 6262 టన్గస్టన్ కార్బైడ్, మోలిబిడినమ్ డై సల్ఫైడ్ మెటల్ మెట్రిక్స్ కాంపోజిట్స్ అనే అంశం పైన చేసిన పరిశోధనలకు గాను డాక్టర్ ప్రధానం చేశారని తెలిపారు.

కమలాపురంలో ఎక్స్‌ప్రెస్ రైళ్లను ఆపాలి

కమలాపురం : రేణిగుంట–గుంతకల్లు రైల్వే లైన్‌లో భాగంగా కమలాపురం రైల్వే స్టేషన్‌లో అన్ని ఎక్స్‌ప్రెస్ రైళ్లకు స్టాపింగ్ ఇవ్వాలని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ కో ఆర్డినేటర్ మీగడ అశోక్‌రెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం కమలాపురంలోని రైల్వే స్టేషన్‌లో స్టేషన్ మాస్టర్‌కు ఆయన వినతిపత్రం అందజేశారు. రైల్వే అధికారులు స్పందించి కమలాపురం రైల్వే స్టేషన్‌లో కరోనాకు పూర్వం ఆపే రైళ్లన్నీ ఆపాలనీ ఆయన డిమాండ్ చేశారు.

సమస్యలను పరిష్కరించండి



ఆర్టీపీపీలో ధర్నా చేస్తున్న కాంట్రాక్టర్ కార్మికులు

ఎర్రగుంట్ల : విద్యుత్ సంస్థలలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికుల పెండింగ్ బకాయిలను వెంటనే చెల్లించి సమాన పనికి సమాన వేతనం అందించాలని ఆంధ్రరాష్ట్ర పవర్ ఎంప్లాయీస్ యూనియన్, తెలుగునాడు విద్యుత్ కార్మిక సంఘం నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం ఆర్టీపీపీలోని ప్రధాన గేటు వద్ద జేఏసీతో సంబంధం లేకుండా తెలుగునాడు విద్యుత్ కార్మిక సంఘం, ఆంధ్రరాష్ట్ర పవర్ ఎంప్లాయీస్ యూనియన్‌లు సంయుక్తంగా ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా రెండు యూనియన్ నాయకులు మాట్లాడుతూ కార్మికులు చాలీచాలని జీతాలతో నానా ఇక్కట్లు పడుతున్నారన్నారు. కార్మికులకు న్యాయం జరిగే వరకు ఆందోళనలు ఉధృతం చేస్తామన్నారు. వీరికి హెచ్–129 యూనియన్ సుబ్బిరెడ్డి మద్దతు తెలిపారు. బీఎంఎస్ నాయకులు, టీఎన్‌టీయూసీ నాయకులు పాల్గొన్నారు.

అవినీతిపై విచారణ చేపట్టాలి

జమ్మలమడుగు : ఆర్‌డబ్ల్యూఎస్ శాఖలో జరుగుతున్న అవినీతిపై ఉన్నతాధికారులు విచారణ చేపట్టాలని సీపీఐ పట్టణ కార్యదర్శి ప్రసాద్ శుక్రవారం ఆర్డీఓ కార్యాలయంలో అధికారులకు వినతిపత్రం అందజేసి మాట్లాడారు. జలజీవన్ మిషన్ కింద చాలా గ్రామాలకు మంచినీటి కులాయి కనెక్షన్లు వచ్చినా ఎవరి ఇంటికి కనెక్షన్లు వారే బిగించుకున్నారే తప్ప అధికారులు కులాయి కనెక్షన్లు ఇచ్చినట్లు దాఖలాలు లేవన్నారు. అయితే అధికారులు కనెక్షన్లు ఇచ్చినట్లు బిల్లులు స్వాహా చేసినట్లు తెలుస్తోందన్నారు. ఉన్నతాధికారులు విచారణ చేపట్టి అవినీతికి పాల్పడిన అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

మంచినీటిని సరఫరా చేయండి

ఎర్రగుంట్ల : ప్రస్తుతం వర్షాలు పడుతున్న సందర్భంగా ప్రజలకు తాగునీటిని సరఫరా చేసే సమయంలో నీటిని పరీక్షించి సరఫరా చేయాలని కమిషనర్ శేషఫణి, పబ్లిక్ హెల్త్ ఈఈ రమణమూర్తిలు తెలిపారు. శుక్రవారం మున్సిపల్ కమిషనర్ చాంబర్‌లో ఇంజనీర్ విభాగం సిబ్బందితో వారు సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఎక్కడైన తాగునీటి పైపులైన్ లీకేజీలను గుర్తించి మరమ్మతులు చేయాలన్నారు.

ఉద్యోగాలకు విద్యార్థుల ఎంపిక

పులివెందుల రూరల్ : పట్టణంలోని జెఎన్‌టీయూ కళాశాలకు చెందిన 4వ సంవత్సరం విద్యార్థులు యూ స్పైడర్స్ కంపెనీ ఉద్యోగాలకు ఎంపికయ్యారని కళాశాల ప్రిన్సిపాల్ విష్ణువర్ధన్ తెలిపారు. శుక్రవారం ఈ కంపెనీ నిర్వహించిన ఇంటర్వ్యూలో 41 మంది విద్యార్థులు ఉద్యోగాలు సాధించారన్నారు. అందులో సీఎస్ఈ విభాగం నుంచి 21 మంది, ఈసీఈ విభాగం నుంచి 12 మంది, సివిల్ విభాగం నుంచి 5 మంది, ఈఈఈ విభాగం నుంచి ముగ్గురు విద్యార్థులు ఎంపికయ్యారన్నారు.

మినుము సాగుపై రైతుల ఆసక్తి

- వ్యవసాయ బోర్ల కింద మినుము సాగు
- వర్షాధారం కింద సాగుకు సిద్ధమవుతున్న రైతులు



మినుము విత్తుతున్న రైతులు

వేముల : రబీలో పంటల సాగుకు రైతులు సిద్ధమవుతున్నారు. ఖరీఫ్‌లో వర్షాలులేక పంటలు సాగు కాలేదు. దీంతో రైతులు మినుము సాగుపై దృష్టి సారించారు. రబీలో ప్రత్యామ్నాయ పంటలుగా బుడ్డశనగ, మినుము పంటలను రైతులు సాగు చేస్తున్నారు. అయితే రైతులు ప్రతి ఏడాది బుడ్డశనగ సాగు చేయడం ద్వారా దిగుబడులు తగ్గిపోతున్నాయని భావిస్తున్నారు. దీంతోనే ఈ ఏడాది పంట మార్పిడి చేసి మినుము సాగును చేపడుతున్నారు. రైతులు వ్యవసాయ బోర్ల, బావుల కింద మినుముతోపాటు మొక్క జొన్న పంటను సాగు చేస్తున్నారు. మినుము తర్వాత రైతులు నువ్వుల పంటను సాగు చేస్తారు. దీని ద్వారా ఒక పంటలో పెట్టుబడులు వచ్చినా, మరో పంటలో వచ్చే దిగుబడులలో ఆదాయం ఉంటుందని రైతులు అంటున్నారు. మినుము సాగు ఎకరాకు రూ.8వేలకు మించి కావడంలేదు. అదే శనగ పంట సాగు చేయాలంటే ఎకరాకు రూ.10వేలకుపైనే అవుతున్నాయని రైతులు అంటున్నారు. రబీ సీజన్‌లో వర్షాధారం కింద మినుము, బుడ్డశనగ పంటలు మినహా ప్రత్యామ్నాయ పంటలు సాగు చేసేందుకు అవకాశం లేదు. నేలల స్వభావం, వాతావరణ పరిస్థితులను అంచనా వేసుకుని రబీలో రైతులు పంటలు సాగు చేయనున్నారు.

మినుము సాగుపై దృష్టి పెట్టాం



రబీలో మినుము సాగుపై దృష్టి పెట్టాం. ప్రతి ఏడాది బుడ్డశనగ పంట సాగు చేయడం ద్వారా దిగుబడులు తగ్గిపోతున్నాయి. ఈ ఏడాది మినుము సాగు సకాలంలో పడుతుందని ఆశతో ఉన్నాం. ఇప్పటికే బోర్ల కింద, బావుల కింద మినుము సాగు చేస్తున్నాం. సాగులో పెట్టుబడులు తక్కువగానే ఉంటున్నాయి. దిగుబడులు బాగా ఉంటాయనే ఆశతో ఉన్నాం.

– చంద్రమోహన్‌రెడ్డి, రైతు, గొందిపల్లె

బోర్ల కింద మొక్క జొన్న సాగు చేస్తున్నాం



రబీలో బోర్ల కింద 2 ఎకరాలలో మొక్క జొన్నను సాగు చేస్తున్నా. ప్రతి ఏడాది ఒకే రకమైన పంటను సాగు చేయడంవల్ల దిగుబడులు తగ్గి నష్టపోతున్నాం. మొక్కజొన్న పంట సాగులో ఆదాయం ఉంటుందనే సాగు చేస్తున్నాం. ఎకరాకు నాలుగైదు వేలకు మించి పెట్టుబడులు కావడంలేదు. మొక్కజొన్న ధరలు స్థిరంగా ఉన్నప్పటికి దిగుబడులు బాగా ఉంటాయని సాగు చేస్తున్నాం.

– రమణారెడ్డి, రైతు, గొందిపల్లె

దక్షిణ కాలువకు మరమ్మతులు చేపట్టండి



మైలవరం దక్షిణ కాలువ నుంచి వృథాగా పోతున్న నీటిని పరిశీలిస్తున్న ఆర్డీఓ జాన్ ఎర్విన్

కమలాపురం : మండలంలోని గొల్లపల్లె వద్ద దెబ్బతిన్న మైలవరం దక్షిణ కాలువకు తక్షణం మరమ్మతులు చేపట్టాలని ఆర్డీఓ జాన్ ఎర్విన్ తెలిపారు. గురువారం తెల్లవారు జామున కురిసిన భారీ వర్షానికి మైలవరం దక్షిణ కాలువలో వరద నీరు ఉధృతంగా ప్రవహించింది. ఈ నేపథ్యంలో కమలాపురం మండలం గొల్లపల్లె వద్ద కాలువకు గండి పడింది. ఆ నీరంతా రైతుల పొలాల్లోకి వెళ్లడంతో రైతులు ఆందోళన చెందారనే వార్త సాక్షి పత్రికలో ప్రచురితం కావడంతో స్పందించిన ఆర్డీఓ అక్కడికి చేరుకున్నారు. కాలువకు పడిన గండిని, అలాగే ఆ నీరంతో రైతుల పొలాల్లో ప్రవహిస్తున్న తీరును చూసి తక్షణం కాలువకు పడిన గండిని పూడ్చండని ఇరిగేషన్ డీఈ రంగన్న, ఈఈ రమేష్‌లకు సూచించారు. శాశ్వత మరమ్మతులు చేయాలంటే కొంత సమయం పడుతుందని, ప్రస్తుతం తాత్కాలికంగా ఇసుక బస్తాలతో గండిని పూడ్చుతామని, నీటి ప్రవాహం పొలాల్లోకి వెళ్లకుండా అడ్డుకట్ట వేస్తామని ఇరిగేషన్ అధికారులు తెలిపారు. రెండు రోజుల్లో పనులు పూర్తి చేయాలని ఆర్డీఓ వారికి సూచించారు. రెవెన్యూ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

ప్రజల ప్రాణాలు గాలికొదిలేసిన కూటమి ప్రభుత్వం



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న నరేన్ రామాంజులరెడ్డి

కమలాపురం : రాష్ట్ర ప్రభుత్వం ప్రజల ప్రాణాలు గాలి కొదిలేసిందని, ఇప్పటికే ఆరోగ్య శ్రీ వైద్య సేవలు ప్రజలకు దూరం అవుతున్న తరుణంలో ప్రభుత్వ మెడికల్ కళాశాలలను ప్రైవేట్ పరం చేయడం దారుణం అని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ నరేన్ రామాంజులరెడ్డి ధ్వజమెత్తారు. శుక్రవారం స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా విష జ్వరాలు ప్రబలి ప్రజలు అల్లాడుతుంటే పుండు పై కారం చల్లినట్లు ప్రభుత్వ మెడికల్ కళాశాలలను ప్రైవేటీకరణ చేయడం దారుణం అని మండి పడ్డారు. జగనన్న 17 మెడికల్ కళాశాలలను ఏర్పాటు చేస్తే చంద్రబాబు తన 15 ఏళ్ల పాలనలో ఒక్క ప్రభుత్వ మెడికల్ కళాశాలను తీసుకు రాలేదన్నారు. సిద్దార్థ ప్రైవేట్ మెడికల్ కళాశాలను అప్పట్లో ఎన్టీఆర్ ప్రభుత్వ కళాశాలగా మార్చారని గుర్తు చేశారు. అదే పార్టీకి చెందిన చంద్రబాబు మాత్రం మెడికల్ కళాశాలలను ప్రైవేటీకరించడం ఎంత వరకు సబబు అని ఆయన ప్రశ్నించారు. ప్రతిదీ పీపీపీ విధానం అంటూ చంద్రబాబు రాగం తీస్తున్నారని, అలాంటప్పుడు తన అధికారం కూడా పీపీపీ విధానంకు అప్పగించాలని సూచించారు. వైద్య ఖర్చులు భరించలేనని ఓ తండ్రి తన బిడ్డను గొంతు నులిమి చంపే స్థితి దాపురించిందంటే ఓ ముఖ్యమంత్రిగా చంద్రబాబుకు సిగ్గుతో తలదించు కోవాలన్నారు. ఆరోగ్య శ్రీని జగనన్న మరింత విస్తరిస్తే చంద్రబాబు మాత్రం అన్నీ ప్రైవేట్ పరంచేస్తున్నాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజలు ఇప్పటికే తాము తప్పు చేశామని భావిస్తున్నారన్నారు. తాగు, సాగు నీరు, రోడ్లు అన్ని ప్రైవేట్ పరం చేయడంతో పాటు జగనన్న దేశంలో అతి పెద్దగా నిర్మించిన అంబేడ్కర్ విగ్రహాన్ని సైతం పీపీపీ కే కట్టబెట్టడం విడ్డూరంగా ఉందన్నారు. సమావేశంలో వైఎస్సార్ సీపీ నాయకులు ఉత్తమారెడ్డి, రాజుపాళెం సుబ్బారెడ్డి, సంబటూరు ప్రసాద్‌రెడ్డి, సుమిత్రా రాజశేఖర్‌రెడ్డి, మహ్మద్ సాదిక్, మారుజోళ్ల శ్రీనివాసరెడ్డి, చెన్నకేశవరెడ్డి, భాస్కర్, సుధా కొండారెడ్డి, జగన్ మోహన్ రెడ్డి, ఇస్మాయిల్, ఇర్ఫాన్, గఫార్, దేవదానం, శరత్ బాబు, జిలానీ బాషా, హీరామియ్య, మోనార్క్, గౌస్ మున్నా, రామ సుబ్బారెడ్డి, నారపురెడ్డి, సుబ్బన్న, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

అసంక్రమిత వ్యాధులపై జాగ్రత్తలు తీసుకోవాలి



కమలాపురంలో గర్భిణులకు శ్రీమంతం చేస్తున్న మెడికల్ ఆఫీసర్ ప్రియాంక

వేంపల్లె : మహిళలు అసంక్రమిత వ్యాధులపట్ల తగిన జాగ్రత్తలు తీసుకోవాలని చక్రాయపేట ప్రభుత్వ ప్రాథమిక వైద్యశాల వైద్యురాలు వి.వాణి సూచించారు. శుక్రవారం చిలేకాంపల్లె పంచాయతీలోని గడ్డంవారిపల్లెలో స్వస్థ నారీ సశక్తి పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా మహిళలకు అసంక్రమిత వ్యాధులపట్ల అవగాహన కల్పించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ శోభారాణి, మాజీ ఉపసర్పంచ్ సురేష్‌రెడ్డి, సీహెచ్‌ఓ వేణుగోపాల్, మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ ఎంవీ ప్రసాద్, హెల్త్ అసిస్టెంట్ వెంగయ్య, వైద్య, అంగన్వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

చింతకొమ్మదిన్నెలో..

చింతకొమ్మదిన్నె : స్వస్థ నారీ...స శక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ఇప్పపెంట సచివాలయం పరిధిలోని తల్లిదండ్రులను సమావేశపరిచి వారికి వైద్య సిబ్బంది ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. పౌష్టిక ఆహార ఆశ్యకతను తెలియజేశారు.

కమలాపురంలో..

కమలాపురం : గర్భిణులు, బాలింతలు, చిన్నారుల ఆరోగ్యమే మహా భాగ్యంగా రాష్ట్ర ప్రభుత్వం పోషణ మాసం నిర్వహిస్తోందని యూ పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ ప్రియాంక తెలిపారు. శుక్రవారం స్థానిక 3వ వార్డు సచివాయలంలో ఆ సచివాలయ పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలోని గర్భిణులకు శ్రీమంతాలు, బాలింతలకు పౌష్టికాహారం అందించడం, చిన్నారులకు అన్న ప్రాసనలు చేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలు, వైద్య ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

22న చలో కలెక్టరేట్

చింతకొమ్మదిన్నె : మండలంలోని చెర్లోపల్లె లే అవుట్‌లో సమస్యలు తిష్టవేసి ఉన్నాయని, వాటి పరిష్కారానికి ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిరసిస్తూ ఈనెల 22వ తేదీన చలో కడప కలెక్టరేట్ ఆందోళన నిర్వహిస్తున్నట్లు సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు మోహన్ పిలుపునిచ్చారు. శుక్రవారం సీపీఎం నాయకులు చెర్లోపల్లి లే అవుట్‌లో పర్యటించి ప్రజలను సమస్యల గురించి అడిగి తెలుసుకున్నారు.

పరిసరాల పరిశుభ్రతకు ప్రాధాన్యతనివ్వాలి



రామనపల్లెలో సూచనలు ఇస్తున్న డీడీవో మైథిలి

వల్లూరు(చెన్నూరు): ప్రజలు పరిసరాల పరిశుభ్రతకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని డీడీవో మైథిలి అన్నారు. చెన్నూరు మండలంలోని రామనపల్లె గ్రామ పంచాయతీని శుక్రవారం ఆమె సందర్శించి డోర్ టు డోర్ చెత్త సేకరణ కార్యక్రమాన్ని ఆమె పరిశీలించారు. ఇంటి నుంచి చెత్త సేకరణ ప్రతిరోజు జరుగుచున్నదా లేదా అని ఆరా తీశారు. అనంతరం ఎస్‌డబ్ల్యూపీసీ షెడ్డును తనిఖీ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో కిరణ్ కుమార్, పంచాయతీ కార్యదర్శి, సిబ్బంది పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారంలో విఫలమైన యాజమాన్యం



రిలే నిరాహార దీక్షలో కూర్చున్న ఉద్యోగులు, కార్మికులు

ఎర్రగుంట్ల : విద్యుత్ సంస్థలలో పనిచేస్తున్న ఉద్యోగ, కార్మికుల సమస్యలను పరిష్కరించడంలో ఏపీ జెన్‌కో యజమాన్యం వైఫల్యం చెందుతోందని ఏపీ జెన్‌కో జేఏసీ నాయకులు ధ్వజమెత్తారు. శుక్రవారం ఆర్టీపీపీలోని ప్రధాన గేటు వద్ద జేఏసీ ఆధ్వర్యంలో రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. ఈ సందర్భంగా జేఏసీ చైర్మన్ ఎస్.కృష్ణయ్య, కన్వీనర్ ఎంవీ రాఘవరెడ్డి, కో–చైర్మన్ శేషారెడ్డిలు మాట్లాడుతూ సెప్టెంబర్ 15 నుంచి 22వ తేదీ వరకు దశల వారీగా ఆందోళనలు చేపడుతున్నా సమస్యలపై యాజమాన్యం స్పందించడంలేదన్నారు. అందులో భాగంగానే 19వ తేదీన రిలే నిరాహార దీక్షలు ప్రారంభించామన్నారు. ఈ రిలే దీక్షలో 14 మంది కూర్చున్నామన్నారు. 23 సంఘాలు, కాంట్రాక్ట్ సంఘాలు సమన్వయం చేసుకుని భవిష్యత్ కార్యచరణను ప్రకటిస్తామన్నారు. ప్రాంతీయ జేఏసీ చైర్మన్ కే మహేశ్‌రెడ్డి, 1104 యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎంవీ గోపాలరావు, జేఏసీ వైస్ చైర్మన్ బండిరామలింగారెడ్డి, 1535 యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు రామకృష్ణారెడ్డి, 1104 యూనియన్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఎం జగదీశ్వర్ తదితరులు పాల్గొన్నారు. బి.వీరభద్రరెడ్డి, వి.సాంబిశివారెడ్డి, ఎన్.రాము, రవిశేఖర్‌రెడ్డి, మహాత్మ జ్యోతిరావు పూలే, బీఆర్ అంబేడ్కర్ విగ్రహాల వద్దనుంచి ర్యాలీగా వచ్చిన దీక్షలను ప్రారంభించారు.

గురుకుల పాఠశాల పరిశీలన



వంటశాలను పరిశీలిస్తున్న డీఎంహెచ్‌ఓ నాగరాజు

కొండాపురం : మండలంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలను శుక్రవారం డీఎంహెచ్‌ఓ నాగరాజు పరిశీలించారు. వర్షకాలం కావడంతో సీజన్ వ్యాధుల పట్ల పాఠశాలలోని విద్యార్థులకు సిబ్బందికి అవగాహన కల్పించారు. అనంతరం వంటశాలను ఆయన పరిశీలించారు. తీసుకోవాల్సిన జాగ్రత్తలగురించి ఆయన వివరించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ మాధవి, తదితరులు పాల్గొన్నారు.

ప్రతి పంటను నమోదు చేయించుకోవాలి



దుకాణంలో ఎరువులను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి చంద్రనాయక్

పులివెందుల రూరల్ : సాగు చేసిన ప్రతి పంటను నమోదు చేయించుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి చంద్ర నాయక్ తెలిపారు. శుక్రవారం ఇ.కొత్తపల్లె రైతు సేవా కేంద్రంలో ఆయన రైతులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. పంట నమోదుకు ఈ నెలాఖరు వరకు మాత్రమే గడువు ఉందన్నారు. రైతులు యూరియాను పంటకు ఒకేసారి వేయకుండా దశల వారీగా వినియోగించుకోవాలన్నారు. అనంతరం పులివెందులలో ఒక ప్రైవేటు ఎరువుల దుకాణాన్ని ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి వి.చెన్నారెడ్డి, రైతు సేవా కేంద్రం ఇన్‌ఛార్జి ఇంతియాజ్, తదితరులు పాల్గొన్నారు.

వల్లూరులో..

వల్లూరు : స్థానికంగా ఉన్న ప్రైవేటు ఎరువుల దుకాణాన్ని విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి జే.మురళీకృష్ణ శుక్రవారం తనిఖీ చేశారు. మండల వ్యవసాయ అధికారి కిరణ్‌కుమార్‌రెడ్డితో కలిసి దుకాణంలోని పలు రికార్డులను తనిఖీ చేశారు.

తొండూరులో..

తొండూరు : పంటలకు యూరియాను ఎక్కువగా వినియోగించవద్దు అని అవసరమైనంత మేరకే వినియోగించుకుంటే మంచిదని జిల్లా వ్యవసాయాధికారి చంద్రనాయక్ రైతులకు సూచించారు. శుక్రవారం ఆయన మన గ్రోమోర్ సెంటర్‌ను తనిఖీ చేసి ఎరువులకు ఫిజికల్ బ్యాలెన్స్, గ్రౌండ్ బ్యాలెన్స్ సరిగా ఉన్నాయా లేదా అని పరిశీలించి మాట్లాడారు. యూరియాను ఎక్కువ ధరలకు విక్రయించినట్లు సమాచారం వస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం ఆయన రైతులతో మాట్లాడుతూ ప్రతి ఒక్కరు రైతు ఇ–పంట నమోదు తప్పనిసరిగా చేసుకోవాలని, సకాలంలో నమోదు పూర్తి చేయాలని గ్రామస్థాయి సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి రాజు, వ్యవసాయ సహాయకులు, రైతులు పాల్గొన్నారు.

ముద్దనూరులో..

ముద్దనూరు : స్థానిక ఎరువుల దుకాణాలను జిల్లా సంయుక్త వ్యవసాయ సంచాలకులు చంద్రనాయక్ శుక్రవారం తనిఖీచేశారు. దుకాణాల్లోని యూరియా స్టాకును పరిశీలించి, కృతిమ కొరత సృష్టిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని, ప్రభుత్వ ధరకే యూరియా విక్రయించాలన్నారు. అనంతరం స్థానిక అగ్రిల్యాబ్‌ను పరిశీలించారు.

గంబూజియా చేపలతో దోమల నివారణ

ముద్దనూరు : అధికంగా నీటి నిల్వలున్న ప్రాంతాల్లో దోమలు వృద్ధి చెందకుండా గంబూజియా చేపపిల్లలను వదిలినట్లు డీఎంహెచ్‌వో నాగరాజు తెలిపారు. శుక్రవారం ఆయన సిబ్బందితో కలిసి కోడిగాండ్లపల్లెను సందర్శించి జిల్లా మలేరియా అధికారి మనోరమతో కలిసి 10 వేల గంబూజియా చేపపిల్లను నీటిగుంతలో వదిలారు.

సింహాద్రిపురంలో..

సింహాద్రిపురం : మండలంలోని అంకాలమ్మగూడూరు, బలపనూరు గ్రామాల చెరువులలో శుక్రవారం దోమల నియంత్రణకు గంబూజియా చేపపిల్లలను నీటిలో మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ సిద్ధయ్య వదిలారు.

ఆదివారం సూర్య గ్రహణం లేదు

పులివెందుల టౌన్ : ఈ నెల 21వ తేదీ ఆదివారం అమావాస్య రోజు సూర్యగ్రహణంలేదని ప్రముఖ పురోహితులు, పంచాంగ విశ్లేషకులు రామ్ కుమార్ శర్మ ఒక ప్రకటన ద్వారా తెలియజేశారు. దేశంలో ఎక్కడ సూర్యగ్రహణం లేదని, భాద్రపద అమావాస్య మహాలయ అమావాస్య పెత్తర్ల అమావాస్య వారి, వారి ఆచారం ప్రకారం పెద్దలకు తర్పణాలు మొదలగు కార్యాలన్నీ యథాప్రకారం ఆచరించవచ్చునన్నారు. చరవాణి, యూట్యూబ్ లలో ఆధారాలులేని శాస్త్ర సమ్మతం కానీ విషయాలను ఎవ్వరూ పరిగణలోనికి తీసుకోరాదన్నారు. ఈ విషయమై ఎటువంటి సందేహాలు అనవసరమని, మహాలయ పేతర్ల అమావాస్య ఆచరించతగినదన్నారు.

విద్యార్థుల శ్రమదానం

పులివెందుల టౌన్ : పట్టణంలోని లయోలా డిగ్రీ కళాశాల విద్యార్థులు శుక్రవారం స్వచ్ఛతా హి సేవా కార్యక్రమంలో భాగంగా శ్రమదానం చేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ రాముడు విద్యార్థులకు ప్రకృతి వనరుల వినియోగం, పరిసరాల పరిశుభ్రత, నిషేధిత సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగంపై అవగాహన కల్పించి వారిచేత ప్రతిజ్ఞ చేయించారు. అలాగే పట్టణంలోని సెంట్రల్ బోలే వార్డులో ఎన్ఎస్ఎస్ విద్యార్థులు పరిసరాలను శుభ్రం చేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఎల్.జోజి రెడ్డి, వైస్ ప్రిన్సిపల్ సి.హెచ్.వన, కో ఆర్డినేటర్ కల్యాణి, వార్డు పారిశుద్ధ్య పర్యావరణ కార్యదర్శులు, కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి



మాట్లాడుతున్న సీఐ విశ్వనాథ్‌రెడ్డి

ఎర్రగుంట్ల : విద్యార్థులు చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని పట్టణ సీఐ విశ్వనాథ్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం పోట్లదుర్తి గ్రామంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల అవరణలో పోలీసుశాఖ అధ్వర్యంలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. చిన్నతనం నుంచే క్రమశిక్షణ అలవాటు చేసుకోవాలన్నారు. ర్యాగింగ్, ఈవ్‌టీజింగ్ వంటి వాటికి దూరంగా ఉండాలన్నారు. మత్తు పదార్థాలను వాడకూడదన్నారు. ప్రస్తుతం సైబర్ నేరాలు చాలా ఎక్కువగా జరుగుతున్నాయని వాటిపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎస్ఐ నాగమురళి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నిరంతర విద్యుత్‌సేవలు అందించాలి



నీట మునిగిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను పరిశీలిస్తున్న ఎస్ఈ రమణ

ఎర్రగుంట్ల : ప్రజలకు నిరంతరం విద్యుత్ సేవలను అందించేందుకు ఏపీఎస్పీడీసీఎల్ కట్టుబడి ఉందని జిల్లా విద్యుత్ శాఖ ఎస్ఈ రమణ అన్నారు. శుక్రవారం ఎర్రగుంట్లలో నీటిలో మునిగిన ట్రాన్స్‌ఫార్మర్లు, విద్యుత్ కార్యాలయాలను ఆయన పరిశీలించి మాట్లాడారు. ట్రాన్స్‌ఫార్మర్లను సురక్షిత ప్రాంతాలకు తరలించి తాత్కాలిక కార్యలాయాల్లోకి మారాలని సిబ్బందికి సూచించారు. కార్యాలయాల్లోని నీటిని తొలగించేందుకు మున్సిపల్ అధికారులతో మాట్లాడాలన్నారు. అలాగే కొత్త భవనాల ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపాలని సివిల్ అధికారులకు ఆదేశించారు. వర్షాలకు తెగిపోయిన విద్యుత్ లైన్లను గుర్తించి మరమ్మతులు చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కిరణ్, ఎఈలు పాల్గొన్నారు

ఆలయాలలో నాయిబ్రాహ్మణులను నియమించండి

వేంపల్లె : స్థానిక వృషబాచలేశ్వరస్వామి దేవస్థానం అనుబంధ ఆలయాలలో నాయీ బ్రాహ్మణులను నియమించాలని బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి గాలిహరిప్రసాద్ అన్నారు. శుక్రవారం తిరుపతిలోని దేవాదాయ శాఖ ప్రాంతీయ సంయుక్త కమిషనర్ కార్యాలయంలో సూపరింటెండెంట్ మల్లికార్జునరెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేవస్థానంనకు దాదాపు వంద కోట్ల మేర ఆస్తులతోపాటు ఏటా కోటి రూపాయలు ఆదాయం వస్తున్నా సాంకేతిక కారణాలు చూపుతూ ప్రభుత్వం తొలగించిందన్నారు. ఆలయాలలో పూజా కార్యక్రమాలలో భజంత్రీలు ఉండాలని, కాబట్టి తప్పనిసరిగా వారిని విధుల్లోకి తీసుకోవాలన్నారు. అలాగే ఎద్దుల కొండపై గత ప్రభుత్వం హయాంలో అసంపూర్తిగా నిలిచిపోయిన ప్రాకారం, తూర్పు, పడమర రాజగోపురం పనులు వాటిని పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు.

టిడ్కో ఇళ్ల ప్రాంతం పరిశీలన



టిడ్కో ఇళ్ల ప్రాంతాన్ని పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్

పులివెందుల : పట్టణంలోని స్థానిక కదిరి రోడ్డులోని టీడీపీ హయాంలో కేటాయించిన టిడ్కో ఇళ్లను శుక్రవారం మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్ వైఎస్సార్‌సీపీ నాయకులతో కలిసి పరిశీలించారు. అనంతరం ఆయన వైఎస్ మనోహర్‌రెడ్డి స్వగృహంలో విలేకరులతో మాట్లాడుతూ హౌసింగ్ కాలనీ నిర్మాణాలు సకాలంలో పూర్తవ్వకపోవడానికి టీడీపీ నాయకులే కారణమని ఆయన అన్నారు. ముఖ్యమంత్రి హోదాలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హౌసింగ్ కాలనీ నిర్మాణాలు ప్రారంభించే నాటి ముందు రోజు 2020 డిసెంబర్ 24వ తేదీ కోర్టులో కేసు వేసి దాదాపు ఏడాది పాటు ఆలస్యం చేసిన దుర్మార్గపు ఆలోచన తెలుగుదేశం పార్టీదే అన్నారు. దాదాపు కొత్త ప్రభుత్వం ఏర్పడి 18 నెలలు గడుస్తున్నా ఇంతవరకు కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించకపోవడంతో రాక్రీట్ సంస్థ కోర్టుకు వెళ్లిందని, కూటమి ప్రభుత్వం నిర్వాహకంవలనే హౌసింగ్ నిర్మాణాలపై ఎటువంటి పురోగతి కనిపించలేదన్నారు. లబ్దిదారుని వాటా కింద ప్రజల నుంచి సేకరించిన రూ.35వేలు మున్సిపల్ కమిషనర్ ఖాతాలో ఉందని, దాని వివరాలు కమిషనర్ ద్వారానే పత్రికాపరంగా ప్రజలకు తెలియచేస్తారని, ప్రజలకు పలు కాలనీలు నిర్మించి వేల సంఖ్యలో గృహాలు నిర్మించి ఇచ్చిన ఘనత వైఎస్ కుటుంబందేనని, ప్రజల సొమ్మును తినే సంప్రదాయం మా పార్టీకి లేదన్నారు. పులివెందుల నుంచి కదిరికి వెళ్లే మార్గంలో టిడ్కో గృహాలు అంటూ కేవలం గుంతలు త్రవ్వి రూ.20 వేలు సేకరించి ప్రజలను మోసం చేసిన ఘనత టీడీపీ వారిదేనని, ఆ లబ్దిదారులకు తిరిగి డబ్బు చెల్లించింది కూడా జగన్‌మోహన్ రెడ్డి హయాంలోనే అని గుర్తు చేశారు. దాదాపు 1600 ఇళ్లు పూర్తైనా కూడా ప్రాథమిక అవసరాలకు మౌలిక సదుపాయాలకు నిధులు లేకపోవడంతో పేదలు నూతన గృహాల్లో చేరలేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. మౌలిక సదుపాయాలైన విద్యుత్, నీటి సదుపాయాలు, రోడ్లు ప్రతి ఇంటికి యూజీడీ వ్యవస్థ కోసం జగన్ మోహన్‌రెడ్డి దాదాపు రూ.90 కోట్లు ఖర్చు చేస్తే కేవలం హౌసింగ్ కాలనీలో యూజీడి నుంచి వ్యర్థాలు ఎస్టీపీలోకి పంపించే వ్యవస్థ కోసం రూ.24 కోట్లు అవసరం అవుతాయని, అది కూడా కూటమి ప్రభుత్వం చేయలేక కల్లబొల్లి మాటలు చెబుతూ రాక్రీట్ సంస్థపై, మరొకరిపై ఆరోపణలు చేయడం దిక్కుమాలిన చర్య అన్నారు. బీటెక్ రవికి చిత్తశుద్ధి ఉంటే చంద్రబాబు నుంచి పులివెందుల హౌసింగ్ కాలనీలో ఆగిపోయిన మౌలిక సదుపాయాలు, అభివృద్ధికి నిధులు మంజూరు చేయించుకుని తర్వాత విమర్శలు చేస్తే బాగుంటుందని ఎద్దేవా చేశారు. ఇకపోతే జగన్‌మోహన్‌రెడ్డి నిర్మించిన వైద్య కళాశాలకు జాతీయ వైద్య కమిషన్ 50 సీట్లు మంజూరు చేస్తే దాన్ని తిరస్కరించమని లేఖ పంపి పేదల కడుపు కొడుతున్న అసమర్థ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ హఫీజ్, వైఎస్సార్‌సీపీ పట్టణ కన్వీనర్ హాల్ గంగాధర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ పట్టణ ఉపాధ్యక్షుడు పార్నపల్లి కిశోర్, కౌన్సిలర్ రాజశేఖర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.